క్లుప్తంగా

కరాటేతో ధైర్యసాహసాలు

కర్నూలు (టౌన్‌): కరాటే సాధన వల్ల విద్యార్థినీ, విద్యార్థుల్లో ధైర్య సాహసాలు అలవడుతాయని ఒలింపిక్‌ సంఘం జిల్లా అధ్యక్షుడు రామంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్‌ అథారిటీ ఔట్‌డోర్‌ స్టేడియంలో కరాటే క్రీడాకారులకు బెల్ట్‌ గ్రేడింగ్‌ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బెల్ట్‌లు ప్రదానం చేశారు. కరాటే అసోసియేషన్‌ రాష్ట్ర అధ్యక్షుడు కోలా ప్రతాప్‌, క్రీడా ప్రతినిధులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు స్పోర్ట్స్‌ కిట్ల పంపిణీ

స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఉన్న కేఎంసీ పార్కులో తైక్వాండో క్రీడాకారులకు ఆదివారం స్పోర్ట్స్‌ కిట్లు పంపిణీ చేశారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, న్యాయవాది శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తైక్వాండో శిక్షణకు ఉపయోగపడే ఈ కిట్ల ద్వారా మరింతగా సాధన చేసి మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. తైక్వాండో అసోసియేషన్‌ సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

కర్నూలు (టౌన్‌): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్‌ కమిషనర్‌ ఆర్‌.జి.వి.కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలకకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే అర్జీలను సమర్పించవచ్చని చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

దసరా కానుకగా ఐఆర్‌ ప్రకటించాలి

కర్నూలు న్యూసిటీ: దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐఆర్‌ ప్రకటించి పే రివిజన్‌ కమిషన్‌ ఏర్పాటు చేసి తీపి కబురు అందించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జి.ఎస్‌.గణపతి, కాకి ప్రకాష్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చి ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా నిరూపించుకోవాలని కోరారు.

'నరేష్‌ది ప్రభుత్వ హత్యే'

కర్నూలు(సెంట్రల్‌): రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన మద్యం పాలసీతో అబ్కారీ శాఖలో సేల్స్‌మెన్‌ ఉద్యోగం పోతుందన్న బెంగతో జూపాడుబంగ్లాకు చెందిన నరేష్‌ రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణా లు కోల్పోయారని, అతని కుటుంబాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా, భార్యకు ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్‌ డిమాండ్‌ చేశారు. అక్టోబర్‌ 1వ తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న అబ్కారీ శాఖ సేల్స్‌మెన్‌ నరేష్‌ ఆది వారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న డీవైఎఫ్‌ఐ నాయకులు నరేష్‌ భౌతిక కాయాన్ని పరిశీలించారు. ఆయన మృతికి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడతూ.. 15 రోజులక్రితం నరేష్‌ ను ఉద్యోగానికి రావొద్దని ఉన్నతాధికారులు చెప్పారన్నారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనతో అక్టోబర్‌ 1వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. నరేష్‌ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరా లు. లేదంటే ఉద్యమానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నాయకులు రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, శంకర్‌, అమర్‌, హరి, కిషన్‌రెడ్డి శివ పాల్గొన్నారు.

కోలుకోలేక న్యాయవాది మృతి

కర్నూలు(హాస్పిటల్‌): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాది కోలుకోలేక వ్యక్తి మృతి చెందాడు. డోన్‌కు చెందిన జూనియర్‌ న్యాయవాది బాలరాజు (25) ప్రతిరోజూ కర్నూలుకు వచ్చి విధులు ముగించుకుని వెళ్లేవాడు. ఈ క్రమంలో ఈ నెల 4వ తేదీన డోన్‌కు బైక్‌పై వెళ్తుండగా నగర శివారులోని వెంగన్నబావి సమీపంలో రోడ్డు దాటుతున్న విజయలక్ష్మి అనే మహిళను ఢీకొట్టి అతనూ కిందపడ్డాడు. ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక బాలరాజు ఆదివారం మృతి చెందాడు.

ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న గోకారి

కర్నూలు న్యూసిటీ: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి నాలుగు నెలలు గడిచినా ఉద్యోగుల సమస్యలపై ఎలాంటి స్పందన లేకపోవడం శోచనీయమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు గోకారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సలాంఖాన్‌ ఎస్టీయూ భవనంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి నాలుగు మాసాలు గడిచినా 12వ పీఆర్‌సీ ఊసే లేదన్నారు. పీఆర్‌సీ ఆలస్యం అవుతున్నందున పెరిగిన ధరలకు అనుగుణంగా 30శాతం మధ్యంతర భృతిని వెంటనే చెల్లించాలని డిమాండ్‌ చేశారు. అలాగే మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు దేవదాసు, శేఖర్‌, మూర్తి, జావలి, హుశేన్‌మియా, నారాయణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజుల క్రితం పాతబస్తీలో వీధికుక్క 30 మందికి పైగా పిల్లలను, పెద్దలను కరిచింది. వారంతా ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజు వీధికుక్క వెంట పడి కరవడంతో కాలనీ ప్రజలు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకొని మంత్రి టీజీ భరత్‌, కమిషనర్‌ రవీంద్రబాబు, పాతబస్తీలోని కార్పొరేటర్లు ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. అప్పట్లో ప్రతి కుక్క కాటు బాధితుడికి రూ.10 వేలు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

గత నెల 20వ తేదీ స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోకి వెళ్లి ఒక విద్యార్థినిని వీధి కుక్క కరిచింది. తీవ్ర గాయాలకు గురి కావడంతో పాఠశాల యాజమాన్యం బాలిక తండ్రికి ఫోన్‌ చేశారు. ఆందోళనకు గురైన తండ్రి వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇలా నగరంలో ఎక్కడో ఒక చోట నిత్యం వీధి కుక్కల బారిన పడి ప్రజలు ఆసుపత్రుల బాట పడుతున్నారు.

కుక్కల బెడదపై చర్యలేవీ ?

- నగరంలో పెరుగుతున్న వీధి కుక్కల దాడులు
- బాధితులు ఆస్పత్రుల పాలవుతున్న పట్టని యంత్రాంగం
- నాలుగు నెలలుగా నిలిచిన కుక్కల బర్త్‌ కంట్రోల్‌ ఆపరేషన్లు
- గత ప్రభుత్వంలో రూ.30 లక్షలతో వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం ఏర్పాటు



వీధి కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులను ఆస్పత్రికి తీసుకొచ్చిన తల్లిదండ్రులు (ఫైల్‌)

కర్నూలు (టౌన్‌): నగరపాలక సంస్థ పరిధిలో మళ్లీ వీధి కుక్కల సమస్య తీవ్రమైంది. నియంత్రించేందుకు సౌకర్యాలు ఉన్నా చిత్తశుద్ధి లేకపోవడంతో సమస్య జఠిలంగా మారింది. కుక్కల బెడద నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి పదే పదే చెబుతున్నా సమస్య కొలిక్కి రాలేదు. గత ప్రభుత్వం నగర శివారులోని గార్గేయపురంలో రూ.30 లక్షలు వెచ్చించి వీధి కుక్కల నియంత్రణకు కేంద్రం ఏర్పాటు చేసింది. అన్ని సౌకర్యాలు కల్పించింది. నవోదయ సొసైటీ అనే సంస్థ వీధి కుక్కలను పట్టుకొచ్చి సంతాన నియంత్రణ ఆపరేషన్‌ చేయించి వదలిపెట్టేది. అయితే నాలుగు నెలల క్రితం నవోదయ సొసైటీకి ఆపరేషన్లు చేసేందుకు అనుమతులు లేవంటూ ఫిర్యాదులు రావడంతో కార్యకలాపాలు నిలిచిపోయాయి. అప్పట్లో రోజుకు 20 కుక్కలకు ఆపరేషన్లు చేసేవారు. ఇప్పుడు నాలుగు నెలలుగా ఆపరేషన్లు లేకపోవడంతో వీధి కుక్కల సంతతి పెరిగిపోతోంది. నగరంలో అధికారికంగా 8,350 వీధి కుక్కలు ఉన్నట్లు చెబుతున్నా, ఆ లెక్క 12 వేలకు పైగా ఉండొచ్చని తెలుస్తోంది. దీంతో రాత్రుళ్లు బయట సంచరించాలంటేనే నగరవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

గత ప్రభుత్వంలో నియంత్రణ చర్యలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకొంది. నగరంలోని 132 సచివాలయాలు, 14 శానిటేషన్‌ డివిజన్ల పరిధిలో మున్సిపల్‌ ఆరోగ్యశాఖ సిబ్బందితో పాటు సచివాలయాల్లో పనిచేసే వార్డు ఎమినీటీస్‌ సిబ్బంది సహకారంతో నెల రోజుల పాటు సర్వే చేయించారు. మొత్తం 52 వార్డులలో 8,350 వీధి కుక్కలను గుర్తించారు. నగరంలో కుక్కల సంతతిని నియంత్రించేందుకు ఆపరేషన్లు చేయించడం వంటి చర్యలు తీసుకున్నారు. హైదరాబాదుకు చెందిన వెటర్నరీ సొసైటీకి బాధ్యతలు అప్పగించారు.

నవోదయ సొసైటీ ఏం చేస్తుందంటే

హైదరాబాద్‌కు చెందిన నవోదయ వెటర్నరీ సొసైటీ ఆధ్వర్యంలో వీధి కుక్కలకు బర్త్‌ కంట్రోల్‌ ఆపరేషన్లు చేసేవారు. కుక్కల సమస్య ఎక్కువగా ఉన్న కృష్ణానగర్‌, న్యూకృష్ణానగర్‌, ఆదిత్యనగర్‌, శరీన్‌నగర్‌, శ్రీరామనగర్‌, వడ్డెగేరి, ధర్మపేట, రోజా వీధి, చిత్తారి వీధి, పాత కల్లూరు, రామలింగేశ్వర్‌ నగర్‌ వంటి అనేక ప్రాంతాలలో వాహనాలను తీసుకెళ్లి వీధి కుక్కలను పట్టుకొని గార్గేయపురంలోని కేంద్రానికి తరలించడం, అక్కడ సంతాన నియంత్రణ ఆపరేషన్‌ చేసిన తరువాత రెండు రోజులు కుక్కను సంరక్షించి ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే వదిలేసేవారు. ఇందుకు ప్రతి కుక్కకు రూ.1350 నగరపాలక సంస్థ చెల్లిస్తుంది. అయితే ఈ ప్రక్రియకు నాలుగు నెలలుగా బ్రేక్‌ పడింది. దీంతో ఇబ్బందులు పునరావృతమయ్యాయి. సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. వీధి కుక్కల బెడదను నియంత్రించి సమస్యను పరిష్కరించాలని నగర వాసులు కోరుతున్నారు.

త్వరలో సమస్య పరిష్కరిస్తాం



నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కలను పట్టుకెళ్లి ఆపరేషన్లు చేసే ప్రక్రియకు బ్రేక్‌ పడింది. నవోదయ సొసైటీ నిర్వాహకులపై ఫిర్యాదులు రావడంతో ఆ సమస్యను క్లియర్‌ చేసేందుకు ఇప్పటికే నగరపాలక కమిషనర్‌ అనిమల్‌ హస్బెండరీ సంచాలకులకు లేఖ రాశారు. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది. వీధి కుక్కల సంతాన నియంత్రణ ఆపరేషన్లను తిరిగి ప్రారంభిస్తాం. – డాక్టర్‌ మల్లన్న, పశువైద్యాధికారి, నగరపాలక సంస్థ


గత ప్రభుత్వం గార్గేయపురంలో ఏర్పాటు చేసిన వీధి కుక్కల సంతాన నియంత్రణ కేంద్రం

జిల్లా అథ్లెట్ల సత్తా


రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన జిల్లా అథ్లెట్లు

కర్నూలు (టౌన్‌): రాజమండ్రిలోని స్పోర్ట్స్‌ అథారిటీ స్టేడియంలో ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్‌ అథ్లెటిక్స్‌ మీట్‌లో కర్నూలు అథ్లెట్లు ప్రతిభ చాటారు. అన్ని విభాగాల్లో సత్తా చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అథ్లెటిక్స్‌ కార్యదర్శి సుబ్బారత్నాలు, శ్రీనివాసులు, కోచ్‌ కాశీరావు అభినందించారు. అథ్లెట్లు వెంకటరామిరెడ్డి, గోవింద్‌, మైత్రీ, సుకన్య, ప్రసన్నకుమారి బంగారు పతకాలు, గాబ్రియేలు, వెంకటేష్‌, దానమ్మ, వీరాకుమారి వెండి పతకాలు, మంజునాథ్‌, వెంకటేష్‌, సుకన్య కాంస్య పతకాలు సాధించారు.

ఏసీబీ డీఎస్పీనంటూ మోసం

కర్నూలు(హాస్పిటల్‌): ఫోన్‌ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ చెప్పుకుని డబ్బులు ఖాతాలో వేయించుకుని మోసం చేసిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. కర్నూలు వన్‌టౌన్‌ ప్రాంతానికి చెందిన విజయభాస్కర్‌ విద్యుత్‌ శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఈ నెల 5వ తేదీన ఓ వ్యక్తి ఫోన్‌ చేసి ఏసీబీ డీఎస్పీనంటూ మాటలు కలిపాడు. నీపై దాడి చేయకుండా ఉండాలంటే రూ.లక్ష తన ఖాతాకు పంపించాలని కోరాడు. ఆందోళన, కంగారులో అతనికి రూ.లక్షను విజయభాస్కర్‌ పంపించాడు. తర్వాత ఆరా తీయగా అది ఫేక్‌ కాల్‌ అని, నిందితుడిది బెంగళూరు అని నిర్ధారించుకున్నాడు. ఘటనపై ఆదివారం వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

దుర్గమ్మా.. దీవించమ్మా


లలితా పీఠంలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు


లలితా పీఠంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


నాగలాపురంలో లలితా దేవిగా..





వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయంలో.., గోదాగోకులంలో గజలక్ష్మిగా.., బాపూజీ నగర్‌లో..., గీతా మందిరంలో అపర్ణగా..


లలితా పీఠంలో..,


నిమిషాంబ ఆలయంలో..,



నన్నూరులో శాకంబరిగా.., ఇతాంద్రపాడులో..


వెంకాయపల్లి ఎల్లమ్మ ఆలయంలో కాళికాదేవిగా..


బుధవార పేట కాళికాంబ ఆలయంలో..


ఓల్డ్‌సిటీ మఠం వీధిలో దుర్గామాత


బుధవారపేట ప్రధాన రహదారిలో..


ఖడక్‌పురాలో కొలువుదీరిన దుర్గమ్మ


గణేష్‌నగర్‌ విజయ గణపతి ఆలయంలో..


సప్తగిరి నగర్‌ చౌడేశ్వరి దేవి ఆలయంలో..


బుధవారపేట కాళికాంబ ఆలయంలో..

కర్నూలు కల్చరల్‌: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు ఆదివారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పంచామృతాభిషేకాలు, హోమాలు, రథోత్సవం, లలితా సహస్ర నామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాల వద్ద ఆధ్యాత్మిక నృత్యాలు, సంకీర్తనలు, కోలాటం, చెక్క భజన, హరికథలు, నవరాత్రుల సందేశాలు, ప్రవచనాలు జరిగాయి. వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో కాళికాదేవిగా, వన్‌టౌన్‌ గీతా మందిరంలో అపర్ణగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో శాకంబరిగా, బండిమెట్ట అంబా భవానీ ఆలయంలో సంతాన లక్ష్మిగా, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయంలో లలితా త్రిపుర సుందరిగా, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయం, బుధవార పేట కాళికాంబ ఆలయంలో, నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయంలో లలితా దేవిగా, గోదా గోకులంలో గజలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. చిన్మయ మిషన్‌, వన్‌టౌన్‌ కాళికాంబ దేవి ఆలయం, పూలబజార్‌ చిన్నఅమ్మవారి శాల, అరోరా నగర్‌ రాజరాజేశ్వరి దేవి ఆలయం, సూర్య నారాయణ స్వామి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

మాజీ సైనికుల సంక్షేమానికి ట్రస్ట్‌

కర్నూలు(అర్బన్‌): మాజీ సైనికుల కుటుంబాల సంక్షేమానికి ట్రస్ట్‌ ఏర్పాటైనట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఆదివారం స్థానిక హార్ట్‌ ఫౌండేషన్‌ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మాజీ సైనికుల చారిటబుల్‌ ట్రస్ట్‌ ప్రతినిధులు సుబేదార్‌ ప్రభాకర్‌, సుబేదార్‌ రమేష్‌ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. ట్రస్ట్‌ విధివిధానాలు, చేపట్టే కార్యక్రమాలను వివరించారు. ట్రస్ట్‌లో సభ్యత్వం ఉన్న మాజీ సైనికులు ఎవరైనా మృతి చెందితే ఆయా కుటుంబాలకు ఆర్థిక సహకారం అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌ ప్రతినిధులు సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్యను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్‌ కోశాధికారి నజీర్‌ అహమ్మద్‌, గడ్డం శ్రీను, మునీర్‌, రఘు రాంరాజు తదితరులు హాజరయ్యారు.


నర్రా పేరయ్యను సన్మానిస్తున్న మాజీ సైనికులు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


వక్త బడేసాహెబ్‌ను సన్మానిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్‌: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర ఉపన్యాసకులు డాక్టర్‌ బడే సాహెబ్‌ అన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం, సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ముచ్చుకోట వెంకట రామయ్య స్మారకోపన్యాసం ఏర్పాటు చేశారు. ×స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయోద్యమ పాత్ర× అనే అంశంపై బడేసాహెబ్‌ ఉపన్యసించారు. గ్రంథాలయ ఉద్యమ తాతగా పేరుగాంచిన ముచ్చుకోట వెంకట రామయ్య అందించిన సేవలు మరువరానివన్నారు. స్వాతంత్ర్యోద్యమ రోజుల్లో తన సొంత ధనంతో ×ఆంధ్ర గ్రంథాలయం× పేరుతో లైబ్రరీని స్థాపించి నడిపారని వివరించారు. సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జ్ఞాన వంతులు కావాలని, జ్ఞానం ఒక్కటే సమాజంలో చైతన్యాన్ని, వెలుగును తీసుకొస్తుందన్నారు. గ్రంథాలయ స్థాపనలు ఒక ఉద్యమంగా సాగడం స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజల పాలిట వరమైందని వివరించారు. కార్యక్రమంలో ముచ్చుకోట వెంకటరామయ్య కుమారుడు చంద్రశేఖర్‌, కోడలు విజయమ్మ, డీఎస్పీ మహబుబ్‌ బాషా, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, ప్రముఖ కవులు డాక్టర్‌ వి.పోతన్న, డాక్టర్‌ సురేష్‌బాబు, నీలిమ, లక్ష్మయ్య, హరిశ్చంద్రారెడ్డి, కల్యాణి, పార్వతీ దేవి, గద్వాల ఈరన్న, మనోహర్‌ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీలో పూడికను తొలగించాలి

కర్నూలు(సెంట్రల్‌): హంద్రీలో పేరుకుపోయిన పూడికను తీయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సి.గురుశేఖర్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం 8వ వార్డు కమిటీ సమావేశాలను నరసింహులు అధ్యక్షతన వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ద పడఖానా, దండిగేరి, ఖండేరి ప్రాంతాల సమీపంలో హంద్రీలో చెత్తా చెదారం పేరుకుపోయిందన్నారు. పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో నీరు నిలిచి దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. ఫలితంగా ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నా మునిసిపల్‌ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ఆయా ఏరియల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటి బారి నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం 8వ వార్డు కమిటీ కార్యదర్శిగా జె.రవికుమార్‌ను నియమించారు.


మాట్లాడుతున్న సి.గురుశేఖర్‌

భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవనం

కర్నూలు కల్చరల్‌: భగవద్గీత పఠనంతో ఉత్తమ జీవన విధానం అలవడుతుందని కర్నూలు ఇస్కాన్‌ బాధ్యులు రఘునందన సేవక్‌ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణా తరగతులు జరిగాయి. జగన్నాథ్‌, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత పఠనం, శ్రవణంతో జీవితంలో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. నైతిక విలువలు నేర్పించాలన్నారు. హరే రామ హరే కృష్ణ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. అనంతరం శీల ప్రభుపాదుల ప్రేమ విందు జరిగింది. ఇస్కాన్‌ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్‌, సుభద్ర, బలదేవ్‌ దేవతామూర్తులు

సర్దార్‌ నాగప్పకు ఘన నివాళి

కర్నూలు కల్చరల్‌/కర్నూలు(సెంట్రల్‌): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్‌ నాగప్ప విగ్రహాన్ని కొండారెడ్డి బురుజు కూడలిలో ఏర్పాటు చేయాలని ఏపీ పీసీసీ ప్రధాన కార్యదర్శి దమోదరం రాధాకృష్ణ డిమాండ్‌ చేశారు. ఆదివారం సర్దార్‌ నాగప్ప జయంతి కార్యక్రమాన్ని కొండారెడ్డి బురుజు సమీపంలో నిర్వహించారు. ఆయనతో పాటు టీచర్‌ సుబ్బారాయుడు, బలిజ సంఘం నేత ప్రేమ్‌కుమార్‌రెడ్డి, రిటైర్డ్‌ పోలీసు సూపరింటెండెంట్‌ జాన్‌, ఆయన కుమారుడు సర్దార్‌ బుచ్చిబాబు హాజరైన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం కోసం సర్దార్‌ నాగప్ప దంపతులు జైలుకెళ్లారని వివరించారు. అంబేడ్కర్‌తోపాటు రాజ్యాంగ రచన, అస్పృశ్యత, కులవివక్ష నిర్మూలనకు సర్దార్‌ నాగప్ప కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాగశేషయ్య, సర్దార్‌ ఉమాదేవి, రైటర్‌ అజిద్‌ పాల్గొన్నారు.


సర్దార్‌ నాగప్ప పోస్టర్‌కు నివాళులర్పిస్తున్న వక్తలు

అంతా కవరింగే..!

ఇంటికేదైనా పార్సిల్‌ తీసుకెళ్లాలంటే ప్లాస్టిక్‌ కవర్‌ ఉండాల్సిందే. రోడ్డుసైడు వ్యాపారస్తులు, పూలు అమ్మేవారు, కిరాణ దుకాణాలు, కూల్‌డ్రింక్‌ షాపులు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసుకునేవారు.. ఇలా యథేచ్ఛగా ప్లాస్టిక్‌ కవర్లలో సరుకులు, వస్తువులను అమ్ముతున్నారు. ప్లాస్టిక్‌ కవర్లను ప్రభుత్వం నిషేధించినప్పటికీ యథేచ్ఛగా వినియోగంలో ఉన్నాయి. అంతేగాకుండా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతే సేవా వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి గాంధీ జయంతి వరకు నిర్వహిస్తోంది. అయినా అదేమీ పట్టించుకోకుండా ప్రజలు, వాపారులు ఇష్టానుసారంగా ప్లాస్టిక్‌ కవర్లను వినియోగిస్తున్నారు. భూమిలో అంత త్వరగా కలిసిపోని ప్లాస్టిక్‌ వ్యర్థాలు పర్యావరణానికి పెను ముప్పుగా మారడంతో పాటు ప్రజలకు కొత్త వ్యాధులను తెచ్చి పెడుతున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్‌, కర్నూలు







